## క్లుప్తంగా

### దిశ చట్టంపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై కనకదుర్గ

రామచంద్రపురం: జిల్లా ఎస్పీ శ్రీధర్, అడిషనల్ ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక భాష్యం స్కూల్‌లో విద్యార్థులకు గురువారం దిశ యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించినట్లు రామచందరపురం ఎస్సై డి.సురేష్‌కుమార్ తెలిపారు. దిశ డీఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో దిశ ఎస్సై కనకదుర్గ, ఇతర సిబ్బంది పాల్గొని లోన్‌యాప్స్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. జోనల్ ప్రిన్సిపాల్ వి.గోవిందరాజులు, ప్రిన్సిపాల్ భాస్కర్, డి.శాంతి తదితరులు పాల్గొన్నారు.

### ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న ఉపాధ్యాయురాలు వాణి

మండపేట: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకోవడం ద్వారా లక్ష్యాలను సాధించవచ్చని స్పందన ఇదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు, ఉపాధ్యాయురాలు ఎంకేపీ వాణి అన్నారు. గురువారం స్థానిక గౌతమి మున్సిపల్ హైస్కూల్‌లోని 8, 9, 10 తరగతుల విద్యార్థులకు స్పందన ఎడ్యుకేషన్ అండ్ ఎంకరేజ్‌మెంట్ డీడ్ (సీడ్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాణి మాట్లాడుతూ విద్యార్థులకు స్టడీ, ఎమోషనల్ స్కిల్స్, ఫైనాన్సియల్, ఇంటర్ పర్సనల్ స్కిల్స్ తదితర వాటిపై శిక్షణ ఇచ్చేందుకు ఈ కార్యక్రమాన్ని తమ సంస్థ ప్రత్యేకంగా రూపొందించిందన్నారు. హెచ్ఎం శోభావళి, ఉపాధ్యాయులు రజియా బేగం, పి.రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్‌కు సత్కారం



మూర్తిని సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘ నేతలు

రాయవరం: అనపర్తి మేజిస్ట్రేట్ కోర్టులో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్‌గా బాధ్యతలు చేపట్టిన రాయవరానికి చెందిన ఎంవీవీఎస్ఎన్ మూర్తిని గురువారం స్థానిక ఆర్యవైశ్య అసోసియేషన్ ఘనంగా సత్కరించింది. ఆర్యవైశ్య అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు గోవర్ధనకృష్ణుడు, సెక్రటరీ బొడ్డు వెంకట్రావు ఆధ్వర్యంలో మూర్తిని సతీసమేతంగా సత్కరించారు. అసోసియేషన్ ట్రెజరర్ దిగవల్లి చంద్రశేఖర్, సంఘ ప్రతినిధులు గ్రంధి వీరభద్రరావు, గ్రంధి బ్రహ్మన్న, కాళ్లకూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### కిసాన్ సమృద్ధి కేంద్రాలతో మేలు



కుయ్యేరులో కిసాన్ సమృద్ధి కేంద్రం ఉపయోగాలను వివరిస్తున్న శంకరనారాయణ

కాజులూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కిసాన్ సమృద్ధి కేంద్రాలతో రైతులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి దూడల శంకరనారాయణ అన్నారు. మండలంలో ఏర్పాటు చేసిన కిసాన్ సంవృద్ధి కేంద్రాలను గురువారం ఆ పార్టీ నాయకులు సందర్శించారు. కుయ్యేరులో శంకరనారాయణ మాట్లాడుతూ ఈ కేంద్రాలలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వ్యవసాయానికి సంబంధించిన అన్ని పనిముట్లు బయట షాపుల కంటే తక్కువ ధరకు దొరుకుతాయన్నారు. ప్రతి నెలా వ్యవసాయ శాస్త్రవేత్తలు అందుబాటులోకి వచ్చి రైతుల సమస్యలకు తగు సూచనలు, సలహాలు అందిస్తారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సలాది వీరబాబు, మండల యువమోర్చా అధ్యక్షుడు నిమ్మన రాజేష్, మండల ప్రధాన కార్యదర్శి పోలిశెట్టి శ్రీనివాస్, నందికోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### పూడిక తొలగింపు



డ్రైన్‌లో పూడిక తీస్తున్న రైతులు

రాయవరం: లొల్లలో గురువారం రైతులంతా కలసి డ్రైన్‌లో పూడికతీత పనులు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు పల్లపు చేలు నీట మునిగాయి. డ్రైన్‌లో నీరు లాగకపోవడంతో పల్లపు పొలాలు నీట మునుగుతున్నాయి. దీంతో రైతులంతా కలసి పూడికతీత పనులు చేశారు. గ్రామానికి చెందిన కానుమిల్లి బాబి, ఇతర రైతులు స్వచ్ఛందంగా పూడిక తీసుకున్నారు.

# పచ్చని మొక్కలు తోడుంటే..

- 'జగనన్న పచ్చతోరణం' పథకంతో మేలు
- అమృత్ సరోవర్‌లో చెరువుల అభివృద్ధి



వెదురుమూడి- కాలేరు రహదారిలో పచ్చని హరివిల్లు



పడమర ఖండ్రికలో రహదారి వెంబడి ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో నాటిన మొక్కలు

కపిలేశ్వరపురం: ప్రకృతిలో పచ్చదనమే అందం.. ఆనందం. చెట్లే మానవాళికి ప్రాణ వాయువును అందించేది. అలాంటి పచ్చదనం తోడుంటే భవిష్యత్తు ఉజ్వలం. మొక్కవోని దీక్షతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది. ఇందులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలతో మొక్కల పెంపునకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. నీడనిచ్చే హరివిల్లులను తెస్తున్నాయి. ఆధునీకత పర్యావరణానికి విఘాతం కల్గిస్తోంది. అన్నిచోట్లా కాంక్రీట్ రోడ్ల నిర్మాణంతో వర్షపునీరు భూమిలోకి ఇంకే మార్గాలు దాదాపు మూసుకుపోతున్నాయి. తద్వారా భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. వాటి ప్రభావాన్ని సాధ్యమైనంత తగ్గించేందుకు మొక్కల పెంపకం ఉపకరిస్తుంది. జగనన్న పచ్చతోరణం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఖాళీ స్థలాలు, రహదారులకు ఇరువైపులా మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టింది.

ఇప్పటికే అనేకచోట పచ్చదనం నింపింది. అమృత్ సరోవర్ పథకంలో చెరువు గట్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. అందుకోసం నిధులను కేటాయించి మొక్కలను సరఫరా చేస్తుంది. జిల్లాకు 75 అమృత్ సరోవర్ చెరువులు మంజూరయ్యాయి. ఇందులో మండలానికి ఒకటి చొప్పున ఉన్నాయి. ఇప్పటికే చెరువు గట్లను పటిష్ట పరిచి కొబ్బరి మొక్కలను నాటారు. సందర్శకులు కూర్చునే విధంగా సిమెంట్ కుర్చీలను కూడా ఏర్పాటు చేశారు.

**రెండు నియోజకవర్గాల్లో ఇలా..**

కపిలేశ్వరపురం మండలంలో 2021లో 2.40 కిలోమీటర్ల మేర నాలుగు ప్రదేశాల్లో 961 మొక్కలను నాటారు. 2022లో నిడసనమెట్టలో 200 మొక్కలను వేశారు. నేలటూరులో అమృత్ సరోవర్‌లో చెరువు గట్లపై 50 కొబ్బరి మొక్కలను నాటారు. రాయవరం మండలంలో 2021లో 9.26 కిలోమీటర్ల విస్తీర్ణంలో పన్నెండు ప్రదేశాల్లో 3,705 మొక్కలు వేశారు. 2022లో కురకాళ్లపల్లి, వెంటూరు, నదురుబాద, వి.సావరం గ్రామాల్లో 1,140 కొబ్బరి మొక్కలు నాటారు. అమృత్ సరోవర్‌లో వెంటూరు చిన్న చెరువును ఎంపిక చేసి 150 కొబ్బరి మొక్కలను వేశారు. రామచంద్రపురం మండలంలో 2021లో 18.23 కిలోమీటర్ల మేర 27 ప్రదేశాల్లో 7,290 మొక్కలు నాటారు. మాలపాడు చెరువును అమృత్ సరోవర్‌లో అభివృద్ధి చేసి వంద కొబ్బరి మొక్కలను నాటారు. కె.గంగవరం మండలంలో 8.25 కిలోమీటర్ల మేర 20 ప్రదేశాల్లో 3,300 మొక్కలు, దంగేరులో 100, యండగండిలో 160 మొక్కలను వేశారు. కాజులూరు మండలంలో 4.15 కిలోమీటర్ల మేర ఎనిమిది ప్రదేశాల్లో 1,660 మొక్కలు, మండపేట మండలంలో 2021లో 11.50 కిలోమీటర్ల మేర 12 ప్రదేశాల్లో 4,600 మొక్కలను వేశారు. వీటి సంరక్షణ చర్యలను కూడా చేపడుతున్నాయి. ఇవి పలుచోట్ల పెద్దవై నీడనిస్తున్నాయి.

**ఒక్కో మొక్క నాటుదాం**



"వృక్షోరక్షితి రక్షితహః అని పెద్దలు ఏనాడో చెప్పారు. మొత్తం జీవకోటికి ప్రాణ వాయువును అందించే వృక్షాలను కాపాడుకోవడం అందరి బాధ్యత. మొక్కలను నాటడం సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలి. మానవ ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం వనాల వృద్ధి అవసరం."

–చీకట్ల గంగరాజు, సామాజిక కార్యకర్త, అంగర

### ద్వారపూడిలో కుంగిన ఇల్లు

మండపేట: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ద్వారపూడి శివారు వంతెన సమీపంలో ఓ ఇల్లు కుంగిపోయింది. బి.సత్యనారాయణకు చెందిన డాబా శిథిలావస్థకు చేరింది. దీనికితోడు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గోడలు నానిపోయి గురువారం ఒక పక్కకు కుంగింది. స్లాబ్‌పై పిట్టగోడ పడిపోయింది. ఈ సంఘటన సమయానికి కింద ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఆ ఇంటిని వైఎస్సార్ సీపీ సేవాదళ్ మండల కన్వీనర్ పోతుల రాంబాబు, మాజీ ఎంపీపీ అడబాల బాబ్జి, పార్టీ నేత పోతుల దుర్గాప్రసాద్ పరిశీలించి తహసీల్దార్ రాజేశ్వరరావుకు సమాచారం అందించారు. ఆయన ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది వచ్చి ముందు జాగ్రత్తగా ఇంట్లో వారిని ఖాళీ చేయించారు.

### రైతులకు కేంద్ర పథకాలు

మండపేట: రైతు సంక్షేమానికి ప్రధాని మోదీ ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ అన్నారు. గురువారం పార్టీ నాయకులతో కలసి తాపేశ్వరంలో ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. నాయకులు వల్లభనేని రవీంద్రబాబు, రాయి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

### పురందేశ్వరిని కలసిన చాట్రాతి

రాయవరం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమితులైన పురందేశ్వరిని మండపేట నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి చాట్రాతి జానకిరాంబాబు గురువారం కలిశారు. రాజమహేంద్రవరం వచ్చిన ఆమెను కలుసుకున్నారు. పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నరాల రాంబాబు, నేతలు ముప్పాటి కృష్ణ, తదితరులు ఉన్నారు.

## ఈ-క్రాప్‌ను సమర్థవంతంగా చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ ఓలేటి బోసుబాబు

మండపేట: వచ్చే నెల 1వ తేదీ నుంచి మొదలయ్యే ఖరీఫ్ ఈ-క్రాప్ నమోదును ఆలమూరు సబ్ డివిజన్ పరిధిలో వ్యవసాయ సిబ్బంది సమర్థవంతంగా చేపట్టాలని జేడీ ఓలేటి బోసుబాబు సూచించారు. సబ్ డివిజన్ పరిధిలో ఖరీఫ్ పనులపై గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ అధికారులతో జేడీ సమీక్షించారు. ఇప్పటి వరకూ సబ్ డివిజన్ పరిధిలో 85 శాతం మేర నాట్లు పూర్తయినట్లు వ్యవసాయాధికారులు వివరించారు. మిగిలిన మేర నాట్లు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని జేడీ ఆదేశించారు. ప్రతి సర్వే నంబర్‌లో ఈ-క్రాప్ నమోదు చేయాలని సూచించారు. ఆర్‌బీకేలలో ఎరువుల విక్రయం, పీఎం కిసాన్ ఈకేవైసీ తదితర అంశాలపై గ్రామాల వారీగా సమీక్షించారు. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని వీపీఏలకు సూచించారు. ఆలమూరు ఏడీఏ కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ అన్ని ఆర్‌బీకేల్లో ఎరువులు అందుబాటులో ఉంచాలని, నెలాఖరు నాటికి పీఎం కిసాన్ ఈకేవైసీ పూర్తి చేయాలని ఆదేశించారు. రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ రాజశేఖర్, టెక్నికల్ ఏఓలు వి.మురళీధర్, పవన్‌కుమార్, మండపేట, ఆలమూరు, రాయవరం, కపిలేశ్వరపురం మండలల ఏఓలు కె.ఏసుబాబు, లక్ష్మీలావణ్య, కె.ప్రభాకర్, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 31న మండల పరిషత్తు సమావేశం

కాజులూరు: స్థానిక మండల పరిషత్తు సర్వసభ్య సమావేశాన్ని 31వ తేదీ సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఐ.రత్నరాజు తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆ రోజు మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ మాత భారతి అధ్యక్షతన జరిగే సమావేశంలో రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకటసుబ్బారావులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

## రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

**ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు**



కేదారిలంకలో లబ్ధిదారుకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: లంక గ్రామాల్లోని ఉద్యాన రైతుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. గురువారం కేదారిలంకలో సర్పంచ్ వీధి వెంకటరెడ్డి అధ్యక్షతన జగనన్న సురక్ష గ్రామసభ జరిగింది. జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి దుర్గారావు, వైఎస్సార్ సీపీ నాయకుడు తోట పృథ్వీరాజ్, ఎంపీటీసీ యర్రంశెట్టి నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ మద్దంశెట్టి దొరబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్‌లతో కలసి ఎమ్మెల్సీ లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్సీ తోటకు ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామసభ ప్రాధాన్యతను తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, కార్యదర్శి సీహెచ్ నరసింహారావు, వీఆర్వో టి.వెంకటేశ్వరరావు వివరించారు. సురక్ష కార్యక్రమంలో భాగంగా 3,202 మందికి సేవలందించామని సచివాలయ ఉద్యోగులు తెలిపారు. అనంతరం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్సీ త్రిమూర్తులు ప్రారంభించారు. సచివాలయ కన్వీనర్లు వీధి గంగాధర్, కాశి శ్రీనివాసరావు, నాయకుడు కోనాల బుజ్జి పాల్గొన్నారు.



కె.గంగవరంలో లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతున్న జెడ్పీటీసీ శ్రీవరలక్ష్మి

కె.గంగవరం: ప్రజలు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పంపన నాగమణి, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి అన్నారు. కె.గంగవరం, శేరిలంక గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. 11 రకాల ధ్రువపత్రాలను ఉచితంగా పొందవచ్చన్నారు. కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒక్క రోజులోనే సంబంధిత పత్రాలు ఉచితంగా అందుకోవచ్చన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హులందరికీ పథకాలు అందుతున్నాయని అన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. సర్పంచ్ కోటి లక్ష్మీనరసమ్మ, కొండేపూడి భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్ కలాం జీవితం స్ఫూర్తిదాయకం



అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాజ్‌కుమారి, తదితరులు

రామచంద్రపురం: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు మేనేజర్ ఎం.రాజ్‌కుమారి అన్నారు. స్థానిక బ్రాడిపేటలో అబ్దుల్ కలాం సేవాదళ్ అధ్యక్షుడు ఎం.బాబ్జి నేతృత్వంలో కలాం వర్ధంతిని గురువారం నిర్వహించారు. కలాం చిత్రపటానికి రాజ్‌కుమారి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకుడు పి.రాము, సీపీఎం నాయకుడు ఎస్.బలరామ్ మాట్లాడుతూ సామాన్యుడిగా పుట్టి అత్యున్నత శిఖరాలను అవలీలగా సాధించి భారతరత్న సహా అనే ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్న అసమాన్యుడు కలాం అని కొనియాడారు. ప్రతి ఒక్కరూ కలలు కనాలని, వాటిని సద్వినియోగం చేసుకునేందుకు ఇష్టంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో విజయ, ఆర్.అప్పారావు, అభి పాల్గొన్నారు.

**రక్తదాన శిబిరం**



95వ సారి రక్తదానం చేస్తున్న వలీ, పక్కన కలాం ట్రస్టు సభ్యులు

మండపేట: భారతదేశ కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన మాజీ రాష్ట్రపతి స్వర్గీయ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చిరస్మరణీయుడని వక్తలు కొనియాడారు. స్థానిక విజయలక్ష్మీనగర్‌లో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కలాం వర్ధంతిని నిర్వహించారు. అనంతరం మెగా రక్తదాన శిబిరాన్ని ట్రస్ట్ చైర్మన్ షేక్ మౌలానా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కలాం జీవితం యువతకు ఆదర్శమన్నారు. తమ ట్రస్టు ద్వారా కులమతాలకు అతీతంగా సేవలు అందిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో 52 మంది రక్తదానం చేశారు. కడియం మండలం మురమండకు చెందిన షేక్ వలీ 95వ సారి రక్తదానం చేశారు. వలీని ట్రస్టు సభ్యులు సత్కరించారు. షేక్ ఇబ్రహీం, అతీఖ్, షేక్ చిన్నబదుల్లా, షేక్ మౌలాలీ, షేక్ బాషా, ఎండీ రెహ్మాన్, ముఫ్తీ ముహమ్మద్ ఫరూఖ్, మస్జిద్ అఖ్సా తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే ఎన్నికల్లో విజయం మనదే

- వైఎస్సార్ సీపీ శ్రేణులంతా కలసికట్టుగా సాగాలి
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని, ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులంతా కలసికట్టుగా ముందుకు సాగాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండపేట అర్బన్, రూరల్, కపిలేశ్వరపురం మండలాలకు చెందిన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, బూత్ ఏజెంట్లతో గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ తోట సమావేశాలు నిర్వహించారు. భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశనం చేశారు. పేదల అభ్యున్నతికి దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. బూత్ ఏజెంట్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి పథకాల గురించి విస్తృతంగా వివరించాలని తోట పిలుపునిచ్చారు. టీడీపీ పాలనకు వైఎస్సార్ పాలనకు మధ్య వ్యత్యాసం గురించి తెలపాలని సూచించారు. ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలన్నారు. ప్రజారంజక పాలన కోసం తిరిగి జగన్‌ను సీఎం చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, పార్టీ రాష్ట్ర నేతలు రెడ్డి రాజుబాబు, దూలం వెంకన్నబాబు, యువనేత తోట పృథ్వీరాజ్, వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, విప్ పోతంశెట్టి ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యులు కుడిపూడి భవాని, పుట్టపూడి అబ్బు, ఎంపీపీలు వుండమట్ల శ్రీనివాస్, మేడిశెట్టి సత్యవేణి, అర్బన్, మండల కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఇంటర్న్‌షిప్‌తో విషయ పరిజ్ఞానం

రాజానగరం: ఇంజినీరింగ్ విద్యార్థులు విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఇంటర్న్‌షిప్ ఎంతో తోడ్పడుతుందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. క్యాంపస్‌లోని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌కి చెందిన కొందరు విద్యార్థులు సీఎస్ఐఆర్ ల్యాబ్స్ (చెన్నై), ఏరోనాటికల్ డవలప్‌మెంట్ ఏజెన్సీ (బెంగళూరు), రెడ్డి ల్యాబ్స్, ఓఎన్‌జీసీ (రాజమండ్రి, కాకినాడ), ఐఐపీఈ (వైజాగ్), ఐఐటీ (గోవా, తిరుపతి), ఎన్ఐటీ (తిరుచురాపల్లి, వరంగల్), వైజాగ్ స్టీల్ ప్లాంట్ మున్నగు వాటిలో రెండు నెలలు ఇంటర్న్‌షిప్ చేశారు. తిరిగి వచ్చిన ఆ విద్యార్థులు గురువారం వీసీని కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారిని అభినందిస్తూ, ఇంటర్న్‌షిప్ ప్రాధాన్యత, అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వర్రావు, హెచ్ఓడీ డాక్టర్ బి. కెజియా రాణి, బి.సుధా కిరణ్, హెచ్.హనుమంతు, బి.లక్ష్మి, సీహెచ్ శ్రీవర్మ, బి.కృష్ణ, కేవీ రమణ మౌనిక, డాక్టర్ డి.కిషోర్ పాల్గొన్నారు.

### చెత్త తొలగించండి

కాజులూరు: పెనుమళ్లలో రోడ్లపై పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు. గ్రామానికి డంపింగ్ యార్డు లేక గృహావసరాల్లో చెత్తాచెదారాన్ని గ్రామ ముఖద్వారంలోని రోడ్డు పక్కన వేస్తున్నారు. అది కుళ్లి దుర్వాసన వస్తుంది. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

# వీడని వరద బెడద

- కోటిపల్లిలో నిలిచిన పంటు ప్రయాణం
- అవస్థలు పడుతున్న ప్రజలు



కోటిపల్లి రేవులో వరద నీటి ప్రవాహం

కె.గంగవరం: మండలంలో లంక భూములు ఇంకా వరద ముంపులోనే ఉన్నాయి.. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సముద్రంలోకి వరద నీటిని వదలడంతో కోటిపల్లిలో వరద ప్రభావం ఐదు రోజులుగా పెరుగుతూనే ఉంది. గురువారం ఉదయం నుంచి గంట గంటకూ నీటి ఉధృతి పెరిగింది. ఇప్పటికే లంకల్లో ఉన్న పశువులను రైతులు గట్ల మీదకు తీసుకువచ్చి ఆశ్రయం కల్పించారు. రాత్రికి మరింత వరదనీరు వచ్చి చేరుతుందని స్థానిక రెవెన్యూ అధికారులు చెప్పడంతో కోటిపల్లిలో మత్స్యకార కాలనీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొద్దిపాటి వరదకే ఏటా కాలనీ నీట మునుగుతోంది. ఇదిలా ఉంటే గోదావరి అవతల వైపునకు వెళ్లే ప్రజలు ఎక్కువగా కోటిపల్లి–ముక్తేశ్వరం మధ్యలో తిరిగే పంటులనే ఆశ్రయిస్తుంటారు. వరద ఉధృతి కారణంగా పంటు ప్రయాణాన్ని ఐదు రోజులుగా రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. నిత్యం సొంత పనులపై వెళ్లే వ్యాపారులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. యానాం నుంచి వెళ్లాలంటే చాలా దూరమని, దీంతో ఆర్థికంగా నష్టపోతున్నామని చెబుతున్నారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

వరద ప్రవాహం పెరిగినా ఎటువంటి ఇబ్బంది లేదని, అయినా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతాలైన కోటిపల్లి, సుందరపల్లి, కూళ్ల గ్రామాల్లో ఆయన పర్యటించారు. వరద ఉధృతిని పరిశీలించారు. కోటిపల్లిలోని ఫ్లడ్ స్టోరేజ్ షెడ్డులో ఉన్న లాంతర్లు, ఇసుక మూటలు, పారలు, గునపాలు, కత్రలు తదితరాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక మత్స్యకార కాలనీలోని వెళ్లే వరద ఉధృతిని పరిశీలించి ప్రజలకు పలు సూచనలు ఇచ్చారు.

**లంకల చుట్టూ నీరు**

కపిలేశ్వరపురం: గోదావరి పరవళ్లు తొక్కుతుంది. ఎగువ ప్రాంతంలో వరద నీటి ఉధృతి కొనసాగుతోంది. దీంతో లంక గ్రామాలను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలపై తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, కార్యదర్శి సీహెచ్ నరసింహారావు పర్యవేక్షణలో వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. అద్దంకివారిలంక, పల్లపులంక, కేదారిలంక, వీధివారిలంక, నారాయణలంక గ్రామాల చుట్టూ వరద నీరు చేరుకుంది. కేదారిలంక– బోడిపాలెం వంతెన మధ్య ఉన్న కాజ్‌వే వద్ద వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఆయా గ్రామాలకు చెందిన మత్స్యకారుల బోట్లు ఒడ్డునే నిలిచిపోయాయి. వ్యవసాయ క్షేత్రాలు ముంపుబారిన పడ్డాయి. గ్రామాల డ్రైన్లలోని నీటి పారుదలకు సమస్యలు తలెత్తిన నేపథ్యంలో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య చర్యలు చేపడుతున్నారు.



కేదారిలంకలో ముంపునీట వ్యవసాయ క్షేత్రం



బోడిపాలెంలో కాజ్‌వే వద్ద వరదను పరిశీలిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ